క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక

బాలాజీచెరువు: అలయన్స్ క్లబ్ పద్మరామ్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు క్లబ్ అంతర్జాతీయ పూర్వపు అధ్యక్షుడు బి.తిరుపతిరాజు మంగళవారం తెలిపారు. క్లబ్ అధ్యక్షుడిగా తెలగాని వీరభద్రరావు, కార్యదర్శిగా కాకరపల్లి శ్రీనివాసరావు, కోశాధికారిగా కృష్ణవేణి, పీఆర్‌ఓగా కొమ్మన తాతారావు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారన్నారు. క్లబ్ సభ్యులను అలయన్స్ అంతర్జాతీయ పూర్వ డైరెక్టర్ చప్పిడి వేంకటేశ్వరరావు, పెంకే శివకుమార్, క్లబ్ పూర్వ గవర్నర్ మునిరెడ్డి అభినందించారు.

రాష్ట్రంలో యూరియా కొరత నిజమే

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రాష్ట్రంలో యూరియా కొరత నిజమేనని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కాకినాడలో మంగళవారం మోదీ సుపరిపాలన 11 ఏళ్ల సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం బాగా పెరిగి ఎరువులు, పురుగుమందులు అధికంగా వాడడం తద్వారా ఉత్పత్తి అయ్యే ఆహారం తినడం వల్ల ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం యూరియా వచ్చే ఏడాది నుంచి ఇవ్వదనే భ్రమతో రైతులు అవసరం లేకున్నా అధికంగా యూరియా కొనుగోలు చేసిన దాచుకుంటున్నారన్నారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ నాయకులు యూరియా ఇవ్వడం లేదని ధర్నాలు చేయడం సరికాదన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బీజేపీ నాయకులు పెద్దిరెడ్డి రవికిరణ్, యార్లగడ్డ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సవరణతో సామాన్యుడికి మేలు



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు, ఇంజినీర్ సత్యనారాయణ

బోట్‌క్లబ్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో పలు సవరణలు చేయడంతో అవి సామాన్యులకు ఎంతో మేలు చేస్తాయని బీజేపీ రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులు, ఇంజినీర్ గట్టి సత్యనారాయణ తెలిపారు. స్థానిక భానుగుడి సెంటర్‌లో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. విద్య, ఆరోగ్యం, గృహోపకరణాలకు భారీగా జీఎస్టీ శ్లాబు తగ్గించడంతో వ్యాపారులకు, సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భానుగుడి సెంటర్‌లోని పలువురు వ్యాపారులు, బీజేపీ నాయకులు ఏడిద కృష్ణ, కొండేటి గంగాధర్ పాల్గొన్నారు.

ప్రపంచ దోమల దినోత్సవం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: దోమల వ్యాప్తి వల్ల కలిగే వ్యాధులపై పట్టణంలోని ఇంద్రానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి బత్తుల జయరాం ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయరాం మాట్లాడుతూ దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులు, వాటి సంక్లిష్టతలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలను నియంత్రించడానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నిల్వ నీటి వనరులను తొలగించడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దోమల నివారణకు తమతమ ఇళ్ల వద్ద జాగ్రత్తలు, రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా దోమల వల్ల కలిగే వ్యాధులను దూరం చేయవచ్చునని అన్నారు. అనంతరం ఫీవర్ సర్వే కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రానగర్ యూపీహెచ్‌సీ సిబ్బందితో పాటు పలువురు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

సామర్లకోట: సచివాలయ కార్యదర్శుల సమస్యలను 15 రోజులలో పరిష్కరించక పోతే నిరసనలు నిర్వహిస్తామని సచివాలయ కార్యదర్శులు తెలియజేశారు. ఈ మేరకు రాష్ట్ర విలేజ్, వార్డు సెక్రటరీల జేఏసీ పిలుపు మేరకు స్థానిక సచివాలయ సిబ్బంది మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్లపాటు ఒకే క్యాడర్‌లో సర్వీసు చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలని, పదోన్నతులు సీనియార్టీ జాబితా విడుదల చేయాలని, పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండి ఇంటింటా సర్వేల నుంచి విముక్తి కలిగించాలన్నారు. వత్తిడి నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులను కష్టాల్లోకి నెట్టారు..

- యూరియా సరఫరాలో ఘోర వైఫల్యం
- రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ
- కాకినాడలో రైతులతో కలసి నిప్పులు చెరిగిన గీత, ద్వారంపూడి
- ఆర్డీఓ కార్యాలయం వద్ద అన్నదాత పోరు





కాకినాడలో అన్నదాత పోరు కార్యక్రమంలో రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళన

కాకినాడ రూరల్/బోట్‌క్లబ్: రైతును కష్టాల్లోకి నెట్టేసిన కూటమి పాలనలో యూరియా సరఫరాలో ఘోరవైఫల్యం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పిఠాపురం కో ఆర్డినేటర్ వంగా గీత ధ్వజమెత్తారు. యూరియా, ఇతర ఎరువులు అందకుండా పక్కదారి పట్టడంతో రైతులు ఆందోళన బాట పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం పిఠాపురం, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ నేతలు, పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన నాయకులు జెడ్పీ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి రానున్న పది పదిహేను రోజుల్లో కొరత లేకుండా అందించాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా నిర్లక్ష్యంగా ఉందని అన్నారు. యూరియా కొరతను నియంత్రించడంతో పాటు బ్లాక్ మార్కెట్ అరికట్టాలన్నారు. సకాలంలో ఎరువులు అందివ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర, వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలలో ఇన్‌పుట్ సబ్సిడీ అందివ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ అన్నదాత పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని, సకాలంలో యూరియా, ఇతర ఎరువులు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి నానాజీ, జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, ఓరుగంటి లోవరాజు, స్థానిక సంస్థల ప్రతినిధులు వులవకాయల నాగ లోవరాజు, ఆనాల సుదర్శన్, అడపా రఘు, రావు చిన్నారావు, రావూరి వెంకటేశ్వరరావు, గండేపల్లి బాబీ, గోపిశెట్టి బాబ్జీ, బెజవాడ సత్యనారాయణ, పుల్ల చందు, గంగ్రేటి శ్రీరామ చంద్రమూర్తి, కారే శ్రీను, రావు చిన్నారావు, జవ్వాది కృష్ణ మాధవరావు, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల రైతు విభాగం అధ్యక్షులు లోకారెడ్డి అప్పన్నదొర, బండి సుబ్బులు, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, గొల్లప్రోలు పార్టీ పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, ఇంటలెక్చువల్ ఫోరమ్ ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, బత్తుల సాయి, రోకళ్ల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు కొప్పిశెట్టి గణేష్, తలిశెట్టి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీనివాస్, పార్టీ మైనార్టీ విభాగం కార్యదర్శి కరీం బాషా, కర్రి చినబాబు, ముమ్మిడి పవన్, ఎస్‌వీ సాయిబాబా, పెంకే సత్తిబాబు, అనుసూరి ప్రభాకర్, పబ్బినీడి రమేష్, నల్లా రాణి, బండి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతులకు మద్దతుగా ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు వంగా గీత, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

యువతా.. మత్తు జోలికి వెళ్లొద్దు



డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జేసీఐ కాకినాడ పోర్టు సభ్యులు

బోట్‌క్లబ్: యువతీ, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జేసీఐ కాకినాడ పోర్టు ప్రెసిడెంట్ డాక్టర్ తన్మయి రామచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక వివేకానంద పార్కులో జేసీఐ కాకినాడ పోర్టు ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. చిన్న వయసులో డ్రగ్స్ జోలికి వెళ్లకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు కానీ, ఉన్నట్టు కానీ తెలిస్తే ఆ సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్ కుమార్, సభ్యులు చెక్కా భద్రం, దాసరి రవితేజ, ఎస్ఎస్‌వీ గౌతమ్, రమేష్, ఎంవీఆర్ మోహన్‌కుమార్, జ్యోతి శ్రీధర్, అనిరుధ్ పాల్గొన్నారు.

పీఆర్సీని ఏర్పాటు చేయాలి

జిల్లా యూటీఎఫ్ నాయకుడు ప్రసాదరావు



రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయ నాయకులు ప్రసాదరావు, నాగేశ్వరరావు తదితరులు

కరప: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా పీఆర్సీ వేయకుండా కాలయాపన చేయడంపై జిల్లా యూటీఎఫ్ నాయకుడు ఐ.ప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కరప మెయిన్ స్కూల్‌లో మంగళవారం యూటీఎఫ్ అధ్యక్షుడు అర్జున్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక బకాయిలు విడుదల చేస్తామని, పీఆర్సీ ఏర్పాటు చేస్తామని తదితర హామీలు ఇచ్చి గద్దె ఎక్కారని, కానీ ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం, అరకొరగా కొన్ని బకాయిలు విడుదల చేయడం మినహా ఏ ఇతర ఆర్థిక బకాయిలు చెల్లించలేదన్నారు. దీంతో 'రణభేరి' పేరుతో ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కారం కోసం సమాయత్తం అవుతున్నామని తెలిపారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాజుబాబు మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అన్ని జిల్లాల్లో 'రణభేరి జాతా' చేస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులకు అవగాహన కల్పించి భవిష్యత్తు ఉద్యమంలో పాలుపంచుకునే విధంగా చైతన్యం నింపుతారన్నారు. ఈ నెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తమ ఆర్థిక సమస్యలు, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు విషయం తెలియజేసి, తదుపరి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రమణ, తలాటం శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు సత్కారం



మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానాలు అందుకున్న గురువులు

కాకినాడ రూరల్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ రూరల్ మండలం నుంచి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గురువులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈఓ రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి హాజరయ్యారు. ఎమ్మెల్యే, ఎంపీపీ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని గాయత్రి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు సింహాద్రమ్మ, చలపతిలను సన్మానించారు. మండల స్థాయిలో ఆరు క్లస్టర్లకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్లు ఇద్దరేసి, ఎస్జీటీలను ఇద్దరు చొప్పున మొత్తం 24 మంది ఉపాధ్యాయులను ఉత్తమ టీచర్లుగా ఎంపిక చేయడంతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, ఎంఈఓ-2 శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులు వినియోగించాలి

జేసీ రాహుల్ మీనా



కట్టమూరులో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న జేసీ, డీఏఓ

సామర్లకోట: జిల్లాలో యూరియా కొరత లేదని, ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవలసిన పని లేదని రైతులకు అందుబాటులో ఉన్న జీవన ఎరువుల వినియోగంపై అలవాటు పెంచుకోవాలని జేసీ రాహుల్ మీనా అన్నారు. మంగళవారం మండల పరిధిలో అచ్చంపేట గ్రామాన్ని ఎంఏఓ ఎస్.విజయకుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ మేరకు రైతుల సమస్యలను, ధాన్యం సేకరణ, వరి రకాల సాగుపై అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ యూరియా అందుబాటులో ఉంచాన్నారు. మోతాదుకు మించి వాడరాదని ఆయన హెచ్చరించారు. యూరియా అధికంగా వాడడం వలన చేను ఏపుగా పెరిగి గాలికి తొందరగా పడిపోతందన్నారు. అంతే కాకుండా చీడపీడలు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటుందని సూచించారు. యూరియాతో పాటు మిగిలిన ఎరువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాలక్ష్మి, ఏఓ వి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనల మేరకే..

పెద్దాపురం: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో శాస్త్రవేత్తల సూచనల మేరకే రైతులు యూరియాను వినియోగించాలని జేసీ రాహుల్ మీనా అన్నారు. మండలంలోని కట్టమూరులో మంగళవారం సాయంత్రం నిర్వహించిన యూరియా పంపిణీని ఎంఏఓ ఎస్.విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్య పంటలు



ప్రకృతి పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించిన ఏడీఏ, ఏఓ తదితరులు

సామర్లకోట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు పండించడానికి అవకాశం ఏర్పడుతుందని వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాలక్ష్మి అన్నారు. మంగళవారం అచ్చంపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల వాతావరణ, నీటి కాలుష్యాన్ని అరికట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ఆహారం తీసుకోవడం వల్ల ప్రాణాంతకరమైన క్యాన్సర్, గుండె వ్యాధుల నుంచి దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంట పొలాలను పరిశీలించాలని రైతులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వి.మురళీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

బోట్‌క్లబ్: ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పళ్ల నారాయణ బాబు, కాకి శ్రీనివాసరావు, కాంతిలాల్ చౌదరి, బుంగా చిన నూకాలమ్మ, లవుడు సత్యవేణి, భమిడిపాటి శ్రీకృష్ణ, కోడూరి కుమారస్వామి, అరుగుల దేవీ ప్రసన్న, నున్న వీర సాయి సూర్య శైలజ, ఎక్స్ ఆఫీషియో సభ్యులు కొడమంచిలి కార్తిక్ ప్రమాణస్వీకారం చేశారు.

కొనసాగుతున్న ఎంపీడీఓల శిక్షణ



ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్న కొత్తపేట ఎంపీడీఓ నరేష్‌కుమార్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలోని ఎంపీడీఓలకు ఇస్తున్న శిక్షణ మంగళవారం కొన సాగింది. 11 జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు సోమవారం నెల రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ శిక్షణ అక్టోబర్ ఏడో తేదీ వరకు కొనసాగుతుంది. పంచాయతీరాజ్ వ్యవస్థ, ఎంపీడీఓల విధులు, బాధ్యతలపై శిక్షణ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం కొత్తపేట ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పంచాయతీ రాజ్ చట్టంపై శిక్షణ ఇచ్చారు.

నేడు ఆటో డ్రైవర్ల ధర్నా

సామర్లకోట: స్త్రీ శక్తి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తాము జీవనోపాధి కోల్పోతున్నామని, తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు, యజమానులు బుధవారం ధర్నా నిర్వహించనున్నారు. సామర్లకోట-కాకినాడ రోడ్డులో మాధవపట్నం వద్ద ధర్నా నిర్వహించి తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేస్తామని ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవపట్నానికి చెందిన ఆటో డ్రైవర్లు అందరూ పాల్గొనాలని పిల్లి పురుషోత్తం పిలుపు నిచ్చారు.

ప్రమాదభరితంగా వదిలేశారు



సర్పవరం జంక్షన్ - వలసపాకల మార్గంలో రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ఐరెన్ ఫ్రేమ్

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇనుమ ఊచలు ఫ్లెక్సీ ద్వారాల కోసం ఉపయోగించి సర్పవరం జంక్షన్ వద్ద ఇలా విడిచిపెట్టారు. జంక్షన్‌లో వెంకటేశ్వరస్వామి గుడి వైపు వలసపాకల వైపు వెళ్లే మార్గంలో డివైడర్‌ను ఆనుకుని విడిచిపెట్టడంతో వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. దగ్గరకు వచ్చే వరకు ద్విచక్ర వాహనచోదకులకు ఇవి కనిపించడం లేదు. ఒక పార్టీ కోసం వినియోగించిన వీటిని తరలించకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపైనే ఉంచడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై అధికారులు, పోలీసులు చర్య తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

మానవ జీవనానికి దిక్సూచి 'షాతత్వ'





సభకు హాజరైన పీఠం సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: పూర్వ పీఠాధిపతి హుస్సేన్ షా రచించిన షాతత్వ గ్రంథం మానవ జీవన మనుగడకు దిక్సూచి వంటిదని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం, నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం సప్తమ పీఠాధిపతి హుస్సేన్ షా 120వ జయంతిని పురస్కరించుకుని ఆశ్రమ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సభలో ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మానవ భౌతిక శరీరము జీవించడానికి అవసరమైన చైతన్యశక్తి ఏడు కేంద్రాల వద్ద మానవ శరీరంలోకి ప్రవేశిస్తోందని, ఆ కేంద్రాల ద్వారానే మనిషి తన ఆధ్యాత్మిక మార్గాన్ని అన్వేషించాలని ఆలీషా పేర్కొన్నారు. ఇడ, పింగళి, సుషుమ్న నాడులు ఈ ఏడు కేంద్రాల ద్వారా వ్యాపిస్తాయని, ఈ రహస్యాలను సప్తమ పీఠాధిపతి షాతత్వము అనే గ్రంథంలో నేను, కాలము, శ్వాస, శూన్యము, హంస, దృశ్యము, కుండలిని అనే ఏడు విషయ రహస్యాలను సులభ శైలిలో ప్రతిపాదించినట్టు ఆయన తెలిపారు. ఇందులోని విషయాలను అందరూ ఆచరించాలని సూచించారు. ధ్యాన, జ్ఞాన, మంత్ర సాధనలతో కూడిన త్రయీ సాధనను అలవరచుకోవడం ద్వారా తాత్విక జ్ఞానం తెలియబడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పీఠం సభ్యులకు పిలుపునిచ్చారు. అనంతరం 'మాత వందనం' పుస్తకాన్ని పీఠాధిపతి సభలో ఆవిష్కరించారు. అనంతరం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేసి, పక్షుల ఆహారం కోసం తయారుచేసిన ధాన్యపు కుచ్చులను సభలో పంపిణీ చేశారు. ఆచార్య గోరుగొంతు అక్కుభట్లు శర్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు చింతపల్లి అప్పారావులకు హుస్సేన్ షా స్మారక పురస్కారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంఖవరం: కత్తిపూడి- శంఖవరం రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. శంఖవరం మండలం కొత్తూరుకి చెందిన కర్రి రాజుబాబు, గోవిందు బైక్‌పై శంఖవరం వచ్చి తిరిగి కొత్తూరు వెళ్లుతుండగా అధిక లోడుతో వస్తున్న టిప్పర్ సిద్ధవారి చెరువు వద్ద బలంగా బైక్ వెనుక భాగంలో ఢీకొట్టింది, ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.